కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

యాదగిరిగుట్ట, నవంబర్ 14 : నియోజకవర్గంలోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదగిరిగుట్టలో గురువారం చెక్కులు అందజేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజాపేట, యాదగిరిగుట్ట, ఆలేరు, మోటకొండూర్, గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాలకు చెందిన 288 మందికి చెక్కులు అందజేశారు.

దాతారుపల్లి చెరువు వద్ద పూజలు

మండలంలోని దాతారుపల్లి చెరువులోకి గోదావరి జలాలు వచ్చి మత్తడి దుంకుతున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య స్థానిక రైతులతో కలిసి గోదారమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గొల్లగుడిసెల వద్ద గొలుసుకట్టు కాల్వల మరమ్మతు పనులను ప్రారంభించారు. తుర్కపల్లి మండలంలోని వెంకటాపురం, మల్లాపురం, సైదాపురం గ్రామాలకు వెళ్లే ఓటీ కాల్వను సందర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కౌన్సిలర్ మల్లేశ్ పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ నిర్మాణానికి స్థల పరిశీలన

మూసీ వాగులో చెక్‌డ్యామ్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్, అధికారులు

అడ్డగూడూరు, నవంబర్ 14 : మండలంలోని మానాయికుంట గ్రామ శివారులో మూసీ వాగులో చెక్‌డ్యామ్ నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే మందుల సామేల్ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోత్కూరు మండలం పొడిచేడు నుంచి చిత్తలూరు వరకు మూసీలో 5 చెక్‌డ్యామ్‌లు నిర్మించనున్నట్లు తెలిపారు. మొదటగా మానాయికుంటలో చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. చెక్‌డ్యామ్ ఏర్పాటుకు ఎంత బడ్జెట్ కావాలో సర్వే చేసి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఈ శివధర్మతేజ, ఈఈ జె.సత్యనారాయణ, డీఈ ఎం.సత్యనారాయణ, ఏఈఈలు చంద్రశేఖర్, విక్రమ్, టీపీసీసీ రాష్ట్ర నాయకులు ఇటికాల చిరంజీవి, నాయకులు లింగాల నర్సిరెడ్డి, వల్లంభట్ల రవీందర్, విద్యాసాగర్, శ్రీశైలం పాల్గొన్నారు.

షాదీఖాన చైర్మన్ నియామకం

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న షాదీఖాన కమిటీ సభ్యులు

చౌటుప్పల్ రూరల్, నవంబర్ 14 : మున్సిపాలిటీలోని షాదీఖాన చైర్మన్‌గా పట్టణానికి చెందిన షేక్ కరీంతోపాటు కమిటీ సభ్యులను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గురువారం ఎంపిక చేశారు. ఎండీ కమ్రుద్దీన్, మహ్మద్ జహీర్, మహ్మద్ షారూఖ్, అబ్బాస్ బేగం కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కమిటీ సభ్యులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

డ్రోన్ ఆధారిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

డ్రోన్ సేవలను ప్రారంభించిన ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్, నవంబర్ 14 : డ్రోన్ ఆధారిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ వికాస్ భాటియా అన్నారు. మండలంలోని కొండమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఐసీఎంఆర్ ఎయిమ్స్ ఆధ్వర్యంలో డ్రోన్ ఆధారిత వైద్య సరఫరా వ్యవస్థ జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా డ్రోన్ సేవలను గురువారం ఆయన ప్రారంభించారు. క్షయ వ్యాధి అనుమానితుల కఫంను సేకరించి డ్రోన్ ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి భువనగిరి ఏరియా ఆసుపత్రి ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎయిమ్స్ సేవలను విస్తరించనున్నట్లు తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో ఇప్పటికే ప్రజలకు పలు వైద్య సేవలు అందిస్తున్నామని, రానున్న రోజుల్లో మరింత వేగంగా వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. భవనాలు పూర్తయిన తరువాత అత్యవసర సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. జిల్లా క్షయ వ్యాధి అధికారి సాయిశోభ, మండల ప్రత్యేకాధికారి సుహాసిని, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యాధికారి జీఆర్ శ్రవణ్‌కుమార్, హెచ్ఈఓ ప్రవీణ్, ఎయిమ్స్ డీన్ రాహుల్ నారంగ్, డిప్యూటీ డైరెక్టర్ బిపిన్ వర్గీస్, అసోసియేట్ ప్రొఫెసర్ భూషణ్ కాంబ్లే, వైద్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం

పోషణ్ ట్రాకర్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వ అధికారులు

బీబీనగర్, నవంబర్ 14 : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను కేంద్ర ప్రభుత్వ మహిళా, శిశు అభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి గ్యానేశ్ భారతి, డైరెక్టర్ భాస్కర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల పనితీరు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, పోషణ్ ట్రాకర్ యాప్‌లో గర్భిణులు, పిల్లల నమోదును తనిఖీ చేశారు. పోషణ్ ట్రాకర్‌లో నమోదు చేసిన విద్యార్థుల వివరాలను పరిశీలించి నమోదు చేసిన విధంగా పిల్లల బరువు, ఎత్తు సరిగా ఉన్నాయా? అని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని, ఆ వివరాలను యాప్‌లో నమోదు చేయాలని అన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ నర్సింగరావు, సీడీపీఓ శైలజ, సూపర్‌వైజర్లు కరుణ, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు రజిత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి : ఎంఈఓ



సర్వేపల్లి పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ మహదేవరెడ్డి

ఆత్మకూరు(ఎం), నవంబర్ 14 : ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలని ఎంఈఓ కొత్త మహదేవరెడ్డి అన్నారు. మండలంలోని సర్వేపల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. డిసెంబర్ 4న నిర్వహించనున్న జాతీయ స్థాయి న్యాస్ పరీక్షలకు 3, 6, 9 తరగతుల విద్యార్థులను సిద్ధం చేయాలని సూచించారు. తెలుగు, ఇంగ్లిషు, గణితం పరీక్షల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి జాతీయస్థాయి పరీక్ష పోటీల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు.

వైభవంగా సుదర్శన నారసింహ హోమం

సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబర్ 14 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో సుదర్శన నారసింహ హోమం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం ప్రధానాలయ ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు సుదర్శన హవనం జరుపగా భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవసేవను జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపి, భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామివారికి వెండి మొక్కు జోడు సేవ, దర్బార్ సేవ నిర్వహించారు. ఉదయం, రాత్రి రెండు దఫాలుగా స్వామివారికి తిరువారాధన చేపట్టి, స్వామి, అమ్మవారికి సహస్రనామార్చన జరిపారు. స్వామివారికి సువర్ణ పుష్పార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు దీపారాధన, సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్నారు. సుమారు 9వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.24,84,542 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. స్వామివారిని రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీ బి.శివధర్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈఓ భాస్కర్‌రావు ఆయనకు ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

ఆలయ నూతన క్యాలెండర్ల విక్రయం

యాదగిరిగుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సరం క్యాలెండర్లను అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆలయం పశ్చిమ రాజగోపురం వద్ద భక్తులకు విక్రయిస్తున్నారు. ఒక్కో క్యాలెండర్ ధర రూ.25గా నిర్ణయించారు. నూతన క్యాలెండర్‌ను కొనుగోలు చేసేందుకు భక్తులు ఆసక్తి చూపారు.

స్వర్ణతాపడం పనులకు మరింత బంగారం

స్వామివారి విమానగోపురం స్వర్ణతాపడం పనులకు 60 కిలోల బంగారం వినియోగిస్తుండగా.. పనులు చేస్తున్న స్మార్ట్ క్రియేషన్ సంస్థకు అక్టోబర్ 10న 12కిలోల బంగారం అందజేశారు. గురువారం ఆలయ ఈఓ భాస్కర్‌రావు చెన్నైకి వెళ్లి మరింత బంగారం అప్పగించారు. ఎంత బంగారం ఇచ్చారన్న అంశం తెలియాల్సి ఉంది. విమానగోపురం స్వర్ణతాపడం పనులకు కావాల్సిన ఏర్పాట్లపై దేవస్థానం అధికారులు దృష్టి సారించారు. వెలుపలి ప్రాకార మండపంలోని మాఢవీధుల్లో పరంజా నిర్మించారు.

గుండాల పోలీస్ స్టేషన్ తనిఖీ

గుండాల పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర

గుండాల, నవంబర్ 14 : గుండాల పోలీస్‌స్టేషన్‌ను భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర గురువారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. క్రైం రేటు గురించి ఆరా తీసి ఎస్ఐ సైదులుకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించిట్లు తెలిపారు. ఆయన వెంట సీఐ కొండల్‌రావు ఉన్నారు.

తాడు జారి కిందపడి తాపీమేస్త్రి దుర్మరణం

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 14 : మండలంలోని జూలూరు గ్రామంలో గురువారం పని చేస్తుండగా ప్రమాదవశాత్తు తాడు జారి కింద పడడంతో తాపీ మేస్త్రి మృతిచెందాడు. సహచర కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నరసరావుపేటకు చెందిన గుంజి క్రాంతి (29) ఆరు సంవత్సరాల నుంచి తాపీ మేస్త్రీగా పనిచేస్తూ బీబీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో పోచంపల్లి మండలం జూలూరు గ్రామానికి చెందిన కోతులారం శ్రీకాంత్ నూతన భవనానికి గురువారం తాడు సాయంతో ప్లాస్టరింగ్ పనులు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు గువ్వ తాడు జారడంతో క్రాంతి కింద పడగా, తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి శివరాణి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

మట్టిని అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 14 : మండలంలోని కనుముక్కుల గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 130లో సుమారు పదెకరాల విస్తీర్ణంలో ఉన్న మట్టెన్న గుట్టను కొల్లగొట్టడానికి ఆక్రమణదారులకు ఇచ్చిన లీజును రద్దు చేయాలని, మట్టిని అక్రమంగా అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యుడు ప్రసాదం విష్ణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మట్టెన్న గుట్టను వృత్తి సంఘాల నాయకులు, రైతులతో కలిసి గురువారం పరిశీలించి నిరసన తెలిపారు. మైనింగ్ లీజుదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టెన్న గుట్టను తవ్వుతూ వృత్తిదారులను, ప్రజలను ఇబ్బంది పెడుతున్న లీజుదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పలువురు గొర్రెలు, మేకలు గుట్టకు మేపుకొని ఉపాధి పొందుతుండగా.. ఆక్రమణదారులకు ఎలా లీజుకు ఇస్తారని ప్రశ్నించారు. క్వారీ పేరుతో లీజుకు తీసుకొని దొంగచాటుగా మట్టిని ఎట్లా అమ్ముకుంటారన్నారు. మైనింగ్ లీజును వెంటనే రద్దు చేయాలని కోరారు. లేకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి నెలకంటి జంగయ్య, రైతులు పాల్గొన్నారు.

'విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి భూమిని కేటాయించాలి'

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 14 : జిల్లాకు ప్రభుత్వం మంజూరు చేసిన 33/11కేవీ 16 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమిని కేటాయించాలని యాదాద్రి భువనగిరి జిల్లా సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అయిటిపాముల బాలమణి, చెరుకుపల్లి విశ్వనాథ్ మాట్లాడుతూ కరెంట్ సమస్య తలెత్తకుండా సమగ్ర చర్యలుచేపట్టాలని కోరారు.

టీటీడీ కల్యాణ మండపం సందర్శన

టీటీడీ కల్యాణ మంటపాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకుంటున్న నర్సిరెడ్డి

భువనగిరి అర్బన్, నవంబర్ 14 : పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో గల టీటీడీ కల్యాణ మంటపాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి గురువారం సందర్శించారు. మంటపంలో సౌకర్యాలు, భవనం ప్రహరీ, మంటపం నిర్వహణను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కల్యాణ మంటపం శిధిలావస్థకు చేరుకుందని, తమకు ఆరు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే అందేలా చూడాలని మంటపం సిబ్బంది కోరారు. ఆయన వెంట నాయకులు కుందారపు కృష్ణచారి, బచ్చు శ్రీనివాస్, రామిని హరీశ్, సైదులు, రమేశ్, పాండు, ధనుంజయ్, కనకరాజు, బీరప్ప, నవీన్, విద్యాసాగర్, నరేందర్, ఆంజనేయులు, రాము పాల్గొన్నారు.

ఉద్యోగులపై దాడి హేయమైన చర్య

- జిల్లా జేఏసీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి

నిరసనలో మాట్లాడుతున్న జిల్లా జేఏసీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 14 : వికారాబాద్‌లో ఉద్యోగులపై జరిగిన దాడి హేయమైన చర్య అని, దాడికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ధరణికోట భగత్ అన్నారు. అధికారులపై జరిగిన దాడిని నిరసిస్తూ గురువారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో మధ్యాహ్న భోజనం సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్, ఔట్‌సోర్సింగ్, డ్రైవర్స్ అసోసియేషన్, టీజేఏసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా ఉండే ఉద్యోగులపై దాడి జరుగడం మంచిది కాదన్నారు. అనంతరం కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గంగాధర్, ఆర్డీఓ కృష్ణారెడ్డి, టీజీఓ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌ప్రసాద్, కార్యదర్శి శ్రీనివాస్, అధికారులు శశికాంత్‌గౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, శైలజ, కవిత, శ్రీనివాస్, సురేశ్, దేశ్యానాయక్, కౌశిక్, మోహన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, కుమార్, డాక్టర్ చైతన్య, చంద్రారెడ్డి, రమేశ్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు దేవాలయాల వంటివి

గ్రంథాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరి అర్బన్, నవంబర్ 14 : గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకున్న వారికి దేవాలయాల వంటివని మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జాతీయ జెండాను ఆవిష్కరించి 57వ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయ పితామహుడు రంగనాథన్, చాచా నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, నిరుద్యోగులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ రేఖ, సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, నాయకులు శెట్టి బాలయ్య, బట్టు రామచంద్రయ్య, బలరాం, బాలేశ్వర్, అంజయ్య, నర్సింగరావు, శ్రీనివాస్‌రావు, గ్రంథాలయ ఉద్యోగులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

'జానీమియా గేయాలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకం'

జానీమియా గేయాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు మంజుల

ఆలేరు టౌన్, నవంబర్ 14 : జానీమియా గేయాలు విద్యార్థులకు పరిజ్ఞానంతోపాటు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని ఆలేరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దాసరి మంజుల అన్నారు. ఆలేరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జానీమియా రచించిన బాల గేయాలు పుస్తకాన్ని ఆమె గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. జానీమియా రచనలు విద్యార్థులకు విజ్ఞానంతోపాటు వినోదాన్ని పెంపొందిస్తాయన్నారు. జానీమియా మాట్లాడుతూ తాను అభ్యసించిన పాఠశాలలో గేయ పుస్తకాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే గేయాలు, కవిత్వాలను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం జానీమియాను ఉపాధ్యాయులు సన్మానించారు.

జల బిందెల ఊరేగింపు

చౌటుప్పల్, నవంబర్ 14 : పట్టణంలోని సురమాంబ కంఠమహేశ్వర స్వామి కల్యాణోత్సవాలు రెండో రోజు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం జలబిందెల ఊరేగింపు, హోమం, పంచామృతాలతో జలాభిషేకం, వస్త్రాలంకరణ, అన్నదానం, మోకు ముస్తాదుల పూజ, అష్టదిగ్బంధనం కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ హనుమంతరావు

సైదాపురం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట, నవంబర్ 14 : విద్యార్థులకు మంచి విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండలంలోని సైదాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. బాలల దినోత్సవం సందర్భంగా పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో కలిసి సరదాగా కొద్దిసేపు ముచ్చటించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థమవుతున్నాయా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలు ఉన్నత స్థాయికి చేరేలా మంచి విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఎంఈఓ శరత్ యామిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

రాజాపేట : క్రీడల్లో గెలుపోటములు సహజమని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన జోనల్ స్థాయి క్రీడల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గురుకుల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థి దశ నుంచే కష్టపడడం అలవాటు చేసుకోవాలన్నారు. వ్యక్తి జీవితంలో క్రీడలు ఎంతో ప్రభావితం చేస్తాయని, శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడుతాయని తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జోనల్ ఆఫీసర్ విద్యారాణి, డీసీఓ జగదీశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, క్రీడల సమన్వయకర్త జి.శ్రీనివాస్, పీడీ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ బి.రాజు, శోభ, రాణి, పీఈటీ శృతి పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి : అదనపు కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్ : మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 14 : బాలల హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. బాలలందరూ ఉన్నతమైన చదువులు చదివి భవిష్యత్‌లో గొప్ప స్థాయికి ఎదుగాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బాలల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. పిల్లలను పోషించలేని స్థితిలో ఎవరైనా ఉంటే ఆ చిన్నారులను శిశు సంక్షేమ శాఖకు అప్పగించాలన్నారు. బాలలు ఎవరైనా సమస్యల్లో ఉంటే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. బాలలతో వెట్టి చాకిరి చేయిస్తే 100కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, డీఆర్డీఓ నాగిరెడ్డి, డీఈఓ సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి పి.యాదయ్య, ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ బండారు జయశ్రీ, మున్సిపల్ చైర్‌పర్సన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, సభ్యులు రోహిత, ఇస్తారి, శివరాజు, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని చందుపట్ల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వివిధ వేషధారణలు చేపట్టారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమ, అంగన్‌వాడీ టీచర్లు దంతూరి భాగ్యమ్మ, లక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.

పిల్లలకు ఆనందమైన బాల్యాన్ని అందించాలి

- జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి లింగారెడ్డి

సుద్దాల గ్రామంలో మాట్లాడుతున్న జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి లింగారెడ్డి

గుండాల, నవంబర్ 14 : పిల్లలకు ఆనందమైన బాల్యాన్ని అందించాలని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి పెసరు లింగారెడ్డి అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని సుద్దాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా వారి ప్రయత్నాలను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఆయుష్మాన్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని

వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ శిల్పిని

బీబీనగర్, నవంబర్ 14 : ప్రతి నెలా 14న ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శిల్పిని అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 14న జరిగే హెల్త్ క్యాంపులో పాల్గొని పీహెచ్‌సీ ద్వారా అన్ని రకాల వైద్య సేవలు పొందాలని, టీడీఎస్ ద్వారా అందరూ రక్త పరీక్షలు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

వస్తాకొండూరులో ధాన్యం పరిశీలిస్తున్న ఏడీఏ పద్మావతి

గుండాల, నవంబర్ 14 : మండల కేంద్రంతోపాటు వస్తాకొండూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏడీఏ పద్మావతి గురువారం పరిశీలించారు. ట్రక్ షీట్లను, రికార్డులను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని సూచించారు. ఆమె వెంట ఏఓ సుజాత, ఏఈఓలు క్రాంతికుమార్, ఆకాంక్ష ఉన్నారు.

చెరువులో చేప పిల్లలను వదిలిన మత్స్యకారులు

చెరువులో చేప పిల్లలు వదులుతున్న మత్స్య సహకార సంఘం సభ్యులు

రామన్నపేట, నవంబర్ 14 : ప్రభుత్వం అందజేసిన ఉచిత చేప పిల్లలను మండల కేంద్రంలోని వెంకటరామయ్య చెరువులో గురువారం వదిలారు. 40వేల రవ్వ, బొచ్చ పిల్లలను చెరువులో వేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కందుల హన్మంతు, కార్యదర్శి పిట్టల మత్స్యగిరి, యాట ఇస్తారి, పెద్ద బోయిన గోవర్ధన్, బోల్ల సైదులు, మనీ, యాట గణేశ్ పాల్గొన్నారు.